క్లుప్తంగా

ఘనంగా కెంపేగౌడ జయంతి



నిద్రగట్టలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: నిద్రగట్ట గ్రామంలో వక్కలిగుల ఆరాధ్య దైవం కెంపేగౌడ జయంతి ఉత్సవాన్ని ఆ కులస్తులు ఘనంగా శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు కుంభాలను తలమీద మోసుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై కెంపేగౌడ చిత్రపటాన్ని వుంచి ప్రత్యేక పూజల అనంతరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా కులపెద్దలు మాట్లాడుతూ కెంపేగౌడ బెంగళూరు నగరాన్ని నిర్మించి దక్షిణ భారతదేశంలోని నిరుద్యోగులకు ఎంతగానో మేలు చేశారని కొనియాడారు. తమ గ్రామంలోని యువకులు కుల మతాలకతీతంగా బెంగళూరులో ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

మడకశిరరూరల్: మండలంలోని సిద్దగిరి గ్రామ సమీపంలో ఉన్న ఈరలక్కమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి హుండీని పగులగొట్టి నాణేలు వదలి నోట్లను ఎత్తుకెళ్లినట్లు శనివారం భక్తులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన కర్ణాటక మద్యం

హిందూపురం అర్బన్ : హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఆ శాఖ సీఐ లక్ష్మీ దుర్గయ్య, సిబ్బంది పాక్షి-నగరగెర రహదారిలో హంద్రీనీవా కాలువ వద్ద తనిఖీలు చేపట్టగా లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన రమేష్, హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన షేక్ హైదర్ రెండు ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక నుంచి మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డారు. ఏడు బాక్సుల్లో 672 పాకెట్ల హయివార్డ్స్ విస్కీ (విలువ రూ.55 వేలు) పట్టుబడింది. వారిపై కేసులు నమోదు చేసి, మద్యం, ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రఫీక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



రొద్దం నారనాగేపల్లిలో కలశాలు మోస్తున్న మహిళలు

రొద్దం: మండలంలోని నారనాగేపల్లి, తురకలాపట్నం గ్రామాల్లో కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కనకదాస చిత్రపటాన్ని గ్రామంలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు కలశాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన కనకదాస చిత్రపటం చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణలు చేసి కలశాలను సమర్పించారు. కనకదాస భక్తిగీతాలు ఆలపించారు.

బ్రహ్మోత్సవాలకు 20 ప్రత్యేక బస్సులు

మడకశిర: భక్తరహళ్లి, జిల్లేడుగుంట లక్ష్మీనరసింహస్వామి, ఆంజయస్వామి బ్రహ్మోత్సవాలకు నియోజకవర్గంలో 20 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం బ్రహ్మరథోత్సవం, సోమవారం భూతప్పలు, జ్యోతుల ఉత్సవాల సందర్భంగా 20 బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అమరాపురం , గుడిబండ, రొళ్ల, అగళి, మడకశిర నుంచి ఈ బస్సులను తిప్పుతామని తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



తమ్మడేపల్లిలో వెండి రథంపై ఆంజనేయస్వామి

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి, నిద్రగట్ట గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. తమ్మడేపల్లిలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారు జామున 3 గంటల వరకు రథోత్సవం సాగింది. రాత్రి ఆలయంలో దీపోత్సవం కనుల పండువగా సాగింది. నిద్రగట్ట గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి జయంతి ఉత్సవంతో పాటు స్వామి వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో కూర్చొబెట్టి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

అభివృద్ధికి నోచుకోని పార్కులు

- దృష్టి సారించని పర్యాటక శాఖాధికారులు
- ఇబ్బందుల్లో పర్యాటకులు, భక్తులు



ఏపీ టూరిజం శాఖ ఏర్పాటు చేసిన బోర్డు



కంపచెట్లతో నిండిన పార్కు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం ఆవరణలో ఉన్న విరుపణ్ణ, వీరన్న పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆలయాన్ని సందర్శించడానికి వచ్చే పర్యాటకులు, భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, పార్కులు అభివృద్ధి చేయడంలో పర్యాటక శాఖ అధికారులు దృష్టి సారించలేక పోతున్నారు. గతంలో లేపాక్షి ఆలయంలో మూడు శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుండేవి. దేవాలయం మొత్తం పురావస్తు శాఖ ఆధీనంలోను, పార్కులు అటవీ శాఖ ఆధీనంలో, ధూప, దీప, నైవేద్యాలు, పూజలు దేవాదాయ శాఖ పరిధిలో జరుగుతుండేవి. దేవాలయానికి పడమర వైపు రెవెన్యూకు సంబంధించిన భూమి ఉండేది. గతంలో ఈ భూమిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పార్కు ఏర్పాటు చేసి, నర్సరీతో పాటు పర్యాటకులు విడిది చేయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. మూడు శాఖల సమన్వయ లోపంతో అటవీ శాఖ వారు పూర్తిగా అభివృద్ధి చేయడం వదులుకున్నారు. దీంతో పార్కుల్లోని చెట్లు, పూలమొక్కలు పూర్తిగా ఎండిపోవడమే కాకుండా వివిధ ఆటవస్తువులు కూడా నిరాదరణకు గుయ్యాయి. ఈ భూమిలో పార్కులు అభివృద్ధి చేస్తామని, భూమిని తమకు కేటాయించాలని పురావస్తు శాఖ అధికారులు ముందుకొచ్చారు. గత ఉత్సవాల సందర్భంగా లేపాక్షికి విచ్చేసిన అప్పటి జిల్లా కలెక్టర్ సందర్శించి కంపచెట్లతో నిండిపోయిన పార్కును చూసి ఏపీ టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్‌కు అప్పగించి పార్కును అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అయితే అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. లేపాక్షికి పర్యాటకుల సందడి పెరుగనున్న దృష్ట్యా ఏపీ టూరిజానికి కేటాయించిన భూమిలో అందమైన పార్కులు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లేపాక్షిని సర్క్యూట్ ఏర్పాటుకు సిద్ధం

లేపాక్షి సర్క్యూట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం టూరిజం పాలసీని తీసుకువస్తున్నట్టు జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ తెలిపారు. ఈ నెల 17న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి విజయవాడలో సర్క్యూట్‌కు సంబంధించిన ప్రణాళికలు విడుదల చేస్తారన్నారు. రాష్ట్రంలో 25 సర్క్యూట్లు ఏర్పాటు చేయనున్నారని, అందులో లేపాక్షి పర్యాటక కేంద్రం కూడా ఉందన్నారు. ఇందుకు సంబంధించిన బడ్జెట్‌ను కూడా ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ సర్క్యూట్‌లో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని దేవాలయాలను కలుపుతూ అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. త్వరలో పర్యాటక రంగంగా లేపాక్షి అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

పార్కులు అభివృద్ధి చేయాలి



పర్యాటక కేంద్రమైన లేపాక్షికి పర్యాటకుల సందడి పెరుగుతోంది. ఇందుకు అనుగుణంగా పర్యాటకులకు విడిదిగా పార్కులను అభివృద్ధి చేయాలి. ఎంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఆలయంకు విచ్చేస్తుంటారు. ఇలాంటి సమయంలో సేద తీర్చుకోవడానికి ఆహ్లాదాన్నిచ్చే పార్కులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

–చలపతి, గలిబిపల్లి

వక్క తోట పరిశీలన



నరికిన చెట్లను పరిశీలిస్తున్న మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: గుణేహళ్లి గ్రామంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వక్క చెట్లను నరికివేశారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, సంయుక్త కార్యదర్శి వాగేష్ తదితరులు శనివారం తోట వద్దకు వెళ్లి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడేళ్ల మొక్కలను ఇలా నరికి వేయడం దారుణమన్నారు. ఇలాంటి విష సంస్కృతి తమ ప్రాంతంలో ఎప్పుడూ లేదన్నారు. ఇకమీదట మడకశిర నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా రైతులు నంజుండప్ప, ఈరన్న, కృష్ణమూర్తి మాట్లాడుతూ తాము వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులమన్నారు. తమకు జరిగిన ఘటన మరొక రైతుకు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. హేమావతి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి అశోక్‌కుమార్



కక్షిదారుడికి అవార్డు ప్రతి అందజేస్తున్న న్యాయమూర్తులు కంపల్లె శైలజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: కక్షిదారులు కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి ఇబ్బందులకు గురి కాకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమమని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం స్థానిక న్యాయస్థానంలో సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మితో కలిసి జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేసి 305 కేసులు పరిష్కరించారు. అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి 43 కేసులను పరిష్కరించి రూ.88 వేల అపరాధరుసుం విధించారు. అక్రమ మద్యం రవాణాకు సంబంధించి 93 కేసులు పరిష్కరించి నిందితులకు రూ.4.23 లక్షలు జరిమానా విధించారు. రెండు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.15.50 లక్షలు అందించారు. 27 సివిల్ కేసులు పరిష్కరించారు. బ్యాంకులకు బకాయిలు ఉన్న బాధితుల నుంచి రూ.18.26 లక్షలు చెల్లింపులు చేయించారు. 24 చిన్నపాటి తగాదా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.10,900 జరిమానా విధించారు. ఒక క్రిమినల్ రివిజన్ కేసుకు సంబంధించి బాధితులకు రూ.6.50లక్షలు చెల్లించారు. కార్యక్రమంలో సభ్యులు సుదర్శన్, సంతోషికుమారి, కళావతి, వేణుగోపాల్, గోపాలకృష్ణ, అంజినమ్మ, బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, ఏపీపీలు ఇందాద్, నగేష్‌తో పాటు ఆయా బ్యాంక్ మేనేజర్లు, న్యాయవాదులు, లోక్‌అదాలత్ సిబ్బంది శారద, హేమావతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 133 కేసుల పరిష్కారం

మడకశిర: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మొత్తం 133 వివిధ కేసులను పరిష్కరించారు. 102 ఎక్సైజ్ కేసుల్లో రూ.4,08,275, 13 క్రిమినల్ కేసుల్లో రూ.8వేలు జరిమానా విధించారు. 18 ఎస్టీసీ కేసులకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా సాగునీటి సంఘాల ఎన్నికలు



రొళ్లలో ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించింది. వైఎస్సార్ జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి నాయకులు పెద్ద ఎత్తున దౌర్జన్యాలకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి అవసరమైన నో డ్యూ సర్టిఫికెట్లను కూడా అధికారులు ఇవ్వలేదు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకలు ఎన్నికలు బహిష్కరించారు.

రొళ్ల: మండలంలోని రొళ్ల సాగు నీటి చెరువు సంఘం అధ్యక్షుడిగా నంజేగౌడు, ఉపాధ్యక్షుడిగా చంద్రమౌళి, ఎం.రాయాపురం అధ్యక్షుడిగా ఈరన్న, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, హునిసేకుంట అధ్యక్షుడిగా శంకర్, ఉపాధ్యక్షుడిగా తిమ్మరాయప్ప, కె.బ్యాడిగెర అధ్యక్షుడిగా సిద్ధగంగమ్మ, ఉపాధ్యక్షుడిగా రవిశంకర్, కాకి అధ్యక్షుడిగా బ్యాటప్ప, ఉపాధ్యక్షుడిగా ధరణేంద్రప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలను ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పర్యవేక్షించారు.

గుడిబండ: తాళికెర చెరువు సాగునీటి సంఘం సభ్యులుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు బరిలో నిలవగా కూటమి నేతలు కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. తాళికెర సర్పంచ్ రంగస్వామి, గ్రామస్తుల చొరవతో గ్రామాభివృద్ధి కోసం ఎన్నికలు సజావుగా జరపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ముగ్గురు సభ్యులుగా గెలుపొందారు.

అగళి: మండలంలోని రావుడి చెరువు సంఘం చైర్మన్‌గా కెంచరాయప్ప, వైస్ చైర్మన్‌గా ఈరన్న, మాధుడి చెరువు చైర్మన్‌గా శ్రీధర్, వైస్ చైర్మన్‌గా రమేష్, ఇనగలూరు చైర్మన్‌గా నరసింహప్ప, వైస్ చైర్మన్‌గా రామచంద్రప్ప, హళ్లికెర చెరువు చైర్మన్‌గా రంగమ్మ, వైస్ చైర్మన్‌గా సమంత్ కుమార్, కోడిపల్లి చెరువు చైర్మన్‌గా శారదమ్మ, వైస్ చైర్మన్‌గాగుండప్ప, అగళి చెరువు చైర్మన్‌గా మల్లికార్జున్, వైస్ చైర్మన్‌గా, ప్రమీళ,7 ఇరిగేపల్లి చెరువు చైర్మన్‌గా మంజునాథ్, వైస్ చైర్మన్‌గా తిమ్మరాయప్ప ఎన్నికయ్యారని తహసీల్దార్ సుబ్బరావు తెలిపారు.

అమరాపురం: మండలంలోని వలస సాగునీటి సంఘం అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్, తమ్మడేపల్లి అధ్యక్షుడిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా చిత్తప్ప, ఉదుగూరు అధ్యక్షుడిగా శివమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఈరలింగప్ప, చిట్నడుకులో ఈశ్వరప్ప, రుద్రముని, గొడనకుంట గురుసిద్దప్ప, తిప్పేస్వామి, నగోనపల్లి మధుసూదన, నారాయణప్ప, కె.శివరం ఈరమల్లప్ప, కెంచమ్మ, హేంజేరు చెరువు అశ్వర్థనారాయణ, అమూల్య, పురవరం నరసింహమూర్తి, జగన్నాథ్, కొర్రేవు, నిజలింగప్ప, బసవేగౌడ్, కెంకెర రామకృష్ణ, శేఖర్, నిద్రగట్ట విజయలక్ష్మి, దాసప్ప, అమరాపురం బి.వీరక్యాతరాయప్ప, మధుసూదన, హలుకూరు శివరాముప్ప, హనుమంతరాయలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎంపీడీఓ రామరావు తెలిపారు.

హిందూపురం అర్బన్: హిందూపురం నియోజక వర్గ వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకపక్షంగా ముగిశాయి. మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నేతలు కుయుక్తులు పన్ని కావాల్సిన వారిని సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. అందరూ ఊహించినట్లే ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా, ఏకపక్షంగా సాగేందుకు టీడీపీ నాయకులు ముందస్తుగానే ప్రణాళికలు రచించి మమ అనిపించారు. వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికలకు బహిష్కరించడంతో ఆ పార్టీ నాయకులు ఎన్నికలకు దూరమయ్యారు. నియోజక వర్గ వ్యాప్తంగా 44 సంఘాలకు శనివారం ఎన్నికలు ముగిసినట్లు మైనర్ ఇరిగేషన్ అధికారి యోగానంద్ తెలిపారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అధికారులు ఏకపక్షంగా నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద అధికార పార్టీకి చెందిన నాయకులు హల్‌చల్ చేశారు. అక్రమ కేసులు బనాయిస్తామని హెచ్చరించడంతో ఇతర పార్టీల నాయకులు పోలింగ్‌లో పాల్గొనలేక పోయారు. మండల వ్యాప్తంగా 14 చెరువులు మైనర్ ఇరిగేషన్ వున్నాయి. అధికార పార్టీ నాయకులు మాత్రమే పోలింగ్‌కు హాజరవడంతో ఆయా సాగునీటి సంఘాలకు చైర్మన్లు, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రొద్దం: మండల వ్యాప్తంగా శనివారం 14 సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని చోట్ల టీడీపీకి చెందిన రెండు వర్గాల వారు పోటీపడ్డారు. అయితే ముఖ్య నాయకులు కలుగ చేసుకుని సాగునీటి సంఘం అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

టీడీపీలో ఆధిపత్య పోరు

గోరంట్ల: సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీలోని మంత్రి సవితమ్మ, హిందూపురం ఎంపీ పార్థసారథి వర్గాల మధ్య ఆధిపత్య పోరు సాగింది. కమ్మలవాండ్లపల్లి సాగునీటి సంఘం ఎన్నికల్లో గాజులవాండ్లపలికి చెందిన వేణుగోపాల్, శివారెడ్డి అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. శివారెడ్డి వేసిన నామినేషన్‌కు కోరం లేక పోవడంతో ఎన్నికల అధికారి వెంకటస్వామి నాయక్ తిరస్కరించారు. వేణు.. మంత్రి సవితమ్మ వర్గీయుడు కాకపోవడంతో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి వేణుకు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా ఆపేశారు. దీంతో వేణుతో పాటు మిగతా కమిటీ సభ్యులు తహసీల్దార్ మారుతితో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ మారుతి ఎన్నికల అధికారి వెంకటస్వామి నాయక్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చివరికి కమ్మలవాండ్లపల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా వేణు ఎన్నికై నట్లు ప్రకటించడంతో సమస్య సద్దుమణిగింది. పులేరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎంపీ పార్థసారథి వర్గానికి చెందిన వెంకటరమణ పల్లికి చెందిన జనార్దనరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. జనార్దనరెడ్డిని అధ్యక్షుడిగా ప్రకటించే క్రమంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సరైన సమాచారం ఇవ్వక పోవడంతో నాగరాజు అనే వ్యక్తి అధ్యక్ష పదవికి నామినేషన్ వేయలేదని పులేరులో మంత్రి సవితమ్మ, తదితరులు వాగ్వాదానికి దిగారు. మరోసారి ఎన్నిక నిర్వహించాలని కోరడంతో ఎన్నికల అధికారి మోహన్ ఎన్నికను పెండింగ్ పెట్టారు. పులేరు సాగునీటి సంఘం ఎన్నిక ప్రక్రియ పంచాయితీ తహసీల్దార్ వద్దకు చేరింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మోహన్, నాగరాజు ఆయన మద్దతుదారులను విచారించారు. విచారణలో పులేరు చెరువు కమిటీ అధ్యక్షుడిగా జనార్దనరెడ్డి మాత్రమే నామినేషన్ వేశారని.. నాగరాజు అనే వ్యక్తి అధ్యక్ష పదవికి నామినేషన్ వేయలేదని ఎన్నికల అధికారి మోహన్ తహసీల్దార్‌కు వివరించారు. అయితే నాగరాజు వర్గీయులు ఎన్నికల అధికారి ఇచ్చిన వివరణను అంగీకరించలేదు. నామినేషన్ వేయమని నాగరాజుకు చెప్పలేదని.. ఎన్నికల అధికారి ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. ఓ దశలో తహసీల్దార్ మారుతి ఇలాగైతే కేసులు నమోదు చేయాల్సి వస్తోందని నాగరాజు వర్గీయులను హెచ్చరించారు. అయినప్పటికి నాగరాజు వర్గీయులు ఎన్నికల అధికారిని దూషించారు. తహసీల్దార్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని నాగరాజు వర్గీయులను అక్కడి నుంచి పంపేశారు.

పరామర్శ



రామిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

రొద్దం: మండల పరిధిలోని చారూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరుగు రామిరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకీ సంఘం అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పార్టీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు అక్కులప్ప, సి.నారాయణ రెడ్డి, ఎస్.నారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన ఒల్లురు రామాంజిన రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పులమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పార్టీ టౌన్ కన్వీనర్ నరసింహులు, నాయకులు శాలి జయశంకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చిట్రా మల్లికార్జున, కొండల రాయుడు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న వేణురెడ్డి తదితరులు

హిందూపురంలో మండలంలోని కొటిపి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నర్సింహారెడ్డి భార్య గంగమ్మ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి తరలివెళ్లి ఆ గ్రామానికి వెళ్లి మృతదేమానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు ఆదేప్ప తదితరులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి

హిందూపురం: కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని కంటి వైద్యులు స్వరూప, సంగీత సూచించారు. స్థానిక ఎంజీఎం హైస్కూల్ పాఠశాల ఆవరణలో ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం సంయుక్తంగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 250 మంది పరీక్షలకు హాజరు కాగా బెంగళూరు శంకర కంటి ఆసుపత్రిలో 95 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. క్యాంప్ వలంటీర్ రహంతుల్లా, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

హిందూపురం: స్థానిక ఎంజీఎం హై స్కూల్ మైదానంలో శనివారం ఆర్డీటీ నిర్వహించిన గర్ల్స్ అండర్-16, అండర్ -18 విభాగాల ఫుట్‌బాల్ పోటీల్లో హిందూపురం లేపాక్షి జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. అండర్ -18 విభాగంలో హిందూపురం జట్టు లేపాక్షి జట్టుపై విజయం సాధించి చాంపియన్ షిప్ గెలుచుకుంది. అండర్ -16 విభాగంలో లేపాక్షి జట్టు హిందూపురం జట్టుపై విజయం సాధించి చాంపియన్ షిప్ సాధించింది. విజేత జట్లకు సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జే.వి.అనిల్ కుమార్, ట్రెజరర్ శేఖర్, సెక్రటరీ షేక్ మొహమ్మద్ సలీం, ఆర్డీటీ ఫుట్‌బాల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిషోర్ బాబు, పీడీలు లోక్‌నాథ్, రామాంజనేయులు, సీనియర్ క్రీడాకారుడు ఆజాద్ బహుమతులు అందజేశారు.

జర్నలిస్టులపై దాడులు హేయం



ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

పెనుకొండ రూరల్: జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విలేకరులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీఓ ఆనంద కుమార్‌కు పెనుకొండ నియోజకవర్గ విలేకరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవి రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి దినపత్రిక విలేకరి రాజారెడ్డిపై టీడీపీ నాయకులు దాడి చేశారన్నారు. దాడి చేసిన కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిషత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సాక్షి విలేకరులు మల్లికార్జున, గోవిందు, జాకీర్, నాగరాజు, శ్రీనివాసులు, సాక్షి టీవి మురళీధర్ నాయడు, ఆంధ్రప్రభ నారాయణ రెడ్డి, నరసింహ మూర్తి, ప్రజాశక్తి నవీన్, ఐ న్యూస్ రిపోర్టర్ హరినాథ్ రెడ్డి, లీగల్ పాయింట్ మధు, ఏపీ న్యూస్ శ్రీనివాసులు, సీమవార్త రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతు ర్యాలీ విజయవంతం

మడకశిర: పుట్టపర్తిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నిర్వహించిన ర్యాలీ విజయవంతమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారడానికి ర్యాలీ విజయవంతం కావడమే నిదర్శనమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని రైతు సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రైతు ఉద్యమం ప్రారంభం కావడం ఖాయమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. పుట్టపర్తికి తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేసినందుకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా దత్త జయంతి

పెనుకొండ: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం దత్త జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా షిర్డీసాయి బాబా ఆలయంలో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం, హోమాలు, ప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారు.
అంతకుముందు షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్య స్వామి, ప్రసాద్ తదితర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పుస్తకాలను ప్రేమించండి

పావగడ: యువత పుస్తకాలను ప్రేమించడం నేర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా శ్రీధర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'నా ప్రీతి పుస్తకం' సంవాద కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువకులు పుస్తకాలు చదివే అలవాటు చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన జీవితాన్ని అనుభవిస్తారన్నారు. ఈ సందర్భంగా ఇతిహాస పరిశోధకుడు రఘునందన్ ప్రదర్శించిన పావగడ ఇతిహాస ఛాయా చిత్ర పటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వైస్ ప్రిన్సిపాల్, డా.మురళీధర సీఐ సురేష్, కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, లింగరాజు, శ్రీనివాస్, నందీష్ పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు చేయండి

పావగడ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దళితుల వర్గీకరణ చేయాలని స్థానిక దళిత పర సంఘటనల సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ ఇంటి ఎదుట తప్పెట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ను అనుసరించి ఆలస్యం చేయకుండా వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంకటేశ్ అందుబాటు లో లేకపోవడంతో మాజీ మంత్రి వెంకటరమణప్ప ఆందోళనకు మద్దతు ప్రకటించారు. దళిత నాయకులు డీజేఎస్ నారాయణప్ప, తిప్పేస్వామి పెద్దన్న, హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయండి

పెనుకొండ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి పోతులయ్య, జిల్లా అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో మంత్రి సవితను కలసి వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తోందని.. వీరికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మెస్ బిల్లులు నేటి వరకు విడుదల కాలేదన్నారు. విద్యార్థులకు బెడ్ షీట్లు, మూడు జతల యూనిఫాం అందించాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726